బేటా పఢావో.. బేటీ బచావో

బెళగావిలో నగ్న ఊరేగింపు ఘటన నేపథ్యంలో కర్ణాటక హైకోర్టు పిలుపు

మౌన ప్రేక్షకులుగా ఉన్న గ్రామస్థులపై జరిమానా విధించాలని ఆదేశం

బెంగళూరు, డిసెంబర్ 18: కర్ణాటకలోని బెళగావిలో దళిత మహిళను నగ్నంగా ఊరేగించిన ఘటనను సుమోటోగా విచారణ జరుపుతున్న కర్ణాటక హైకోర్టు.. సమాజంలో సమిష్టి బాధ్యతను పెంపొందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అలాగే బేటా పఢావో.. బేటీ బచావో అంటూ కొత్త నినాదాన్నిచ్చింది. బాలికలను గౌరవించాలని, రక్షించాలని బాలురకు తల్లిదండ్రులు బోధించినప్పుడే, బాలికల రక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నది. బెళగావి జిల్లాలోని వంటమూరి గ్రామంలో ఈ నెల 10న ఓ దళిత మహిళను(42) కొందరు నగ్నంగా ఊరేగించి కరెంటు స్తంభానికి కట్టి భౌతిక దాడి చేశారు. ఆమె కొడుకు అదే గ్రామానికి చెందిన మరో బాలికతో పారిపోయినందుకు ఆగ్రహం చెందిన బాలిక కుటుంబ సభ్యులు ఈ దాడి చేశారు. ఈ దాడిని 50-60 మంది గ్రామస్థులు మౌన ప్రేక్షకులుగా తిలకించారు తప్ప నిందితులను అడ్డుకోలేదు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మౌన ప్రేక్షకులుగా ఉన్న గ్రామస్థులపై జరిమానా విధించి, ఆ మొత్తాన్ని బాధితురాలిని అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సామూహిక బాధ్యత కోసం కొత్త చట్టాలు చేయాలని కోర్టు సూచించింది. 'ఎంతో మంది ఘటనకు సాక్షులుగా ఉన్నారు. కానీ ఎవరూ ఏమీ చేయలేదు. ఇది సామూహిక పిరికితనం. దీన్ని సరిదిద్దాలి. కారణాలను కనిపెట్టి లా కమిషన్‌కు అందించాలి. వాళ్లు ఒక చట్టం రూపొందించాలి' అని కోర్టు తెలిపింది.

మహాభారతంలో కూడా ఇలా జరగలేదు

అంతకుముందు ఈ ఘటనను అరికట్టడంలో పోలీసుల వైఫల్యంపై ప్రభుత్వాన్ని కోర్టు విమర్శించింది. 'మిగతా మహిళల్లో నెలకొన్న భయం మాటేమిటి? ఈ దేశంలో తాను సురక్షితంగా లేనని ఆమె భావిస్తుంది. మహాభారతంలో కూడా ఇలా జరగలేదు. ద్రౌపదికి కృష్ణుడు సాయం చేశాడు. కానీ ఆధునిక ప్రపంచంలో సాయం చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. దురదృష్టవశాత్తు ఇది దుర్యోధన, దుశ్శాసనులతో కూడిన ప్రపంచం' అని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది.

దళిత విద్యార్థులతో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయురాలు

దళిత విద్యార్థులతో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్

- కర్ణాటకలో దారుణ ఘటన

కోలార్, డిసెంబర్ 18: కర్ణాటకలో దారుణ ఘటన జరిగింది. కోలార్ జిల్లా యలువహళ్ళి లోని మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో దళిత విద్యార్థులతో స్కూలు అధికారులు బలవంతంగా సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయించారు. ఈ ఘటనపై పెద్దయెత్తున విమర్శలు రావడంతో సీఎం సిద్ధరామయ్య జోక్యం చేసుకొని సమగ్ర విచారణకు ఆదేశించారు. పాఠశాల ప్రిన్సిపల్ భారతమ్మ, టీచర్ మునియప్ప, హాస్టల్ వార్డెన్ మంజునాథ్, అతిథి టీచర్ అభిషేక్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. భారతమ్మ, మునియప్పను పోలీసులు అరెస్ట్ చేశారు. మిగతా ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

92 మంది ఎంపీల సస్పెన్షన్

సోమవారం ఒక్కరోజే 78 మంది విపక్ష ఎంపీలపై వేటు.. గత వారం 14 మంది

- భద్రతా వైఫల్యంపై పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిపక్ష ఎంపీల ఆందోళన
- హోం మంత్రి ప్రకటన చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: పార్లమెంట్‌లో గత వారం చోటుచేసుకొన్న భద్రతా వైఫల్యం ఘటనపై ఉభయ సభలు సోమవారం అట్టుడికాయి. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఆందోళనలు కొనసాగించారు. దీంతో సభా కార్యకలాపాలకు అటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ లోక్‌సభలో 33 మందిని, రాజ్యసభలో 45 మంది విపక్ష ఎంపీలను సభాపతులు సస్పెండ్ చేశారు. మొత్తంగా రెండు సభల నుంచి సోమవారం ఒక్కరోజే 78 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. గత వారం కూడా 14 మంది సభ్యులను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సెషన్‌లో ఇప్పటివరకు ఏకంగా 92 మంది ప్రతిపక్ష ఎంపీలను ప్రభుత్వం సస్పెండ్ చేసినట్టు అయింది.

లోక్‌సభలో 33 మందిపై వేటు

లోక్‌సభలో 30 మంది ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయగా.. స్పీకర్ పొడియం ఎక్కి నినాదాలు చేసిన మరో ముగ్గురిపై ప్రివిలేజ్ కమిటీ నివేదిక వచ్చేవరకు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ తెలిపారు. సస్పెన్షన్ గురైన 33 మంది ఎంపీల్లో కాంగ్రెస్ నుంచి 11 మంది, డీఎంకే-10, టీఎంసీ-9 చొప్పున ఉన్నారు. పోడియం ఎక్కి అభ్యంతరంగా ప్రవర్తించారంటూ ఎంపీలు కే జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలేక్ సస్పెన్షన్‌పై మంత్రి ప్రహ్లాద్ జోషి వేరే తీర్మానం పెట్టారు.

రాజ్యసభలో 45 మంది ఎంపీలు..

రాజ్యసభలో 45 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. రాజ్యసభలో ఎంపీల సస్పెన్షన్‌పై సభా నాయకుడు పీయూష్ గోయల్ తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను మూజవాణి ఓటుతో ఆమోదించారు. 11 మంది ఎంపీల ప్రవర్తనపై కమిటీ మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సభ కోరింది. రాజ్యసభలో సస్పెన్షన్‌కు గురైన వారిలో కాంగ్రెస్ ఎంపీలు ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, సుర్జేవాలా, ఎస్పీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్, టీఎంసీ ఎంపీ శాంతను సేన్ తదితరులు ఉన్నారు.

పార్లమెంటరీ జవాబుదారీతనం లేదా?

గత వారం సస్పెన్షన్‌కు గురైన 13 మంది లోక్‌సభ ఎంపీల్లో కొంత మంది సోమవారం పార్లమెంట్ మెట్లపై కూర్చొని ఆందోళన చేపట్టారు. భద్రతా ఉల్లంఘన ఘటనపై హోంమంత్రి ప్రకటన చేయాలనే ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ నెల 13న అసలు ఏం జరిగిందనే దానిపై ప్రధాని లేదా హోంమంత్రి ప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఎంపీ మహ్మద్ జావీద్ డిమాండ్ చేశారు. ఎంపీల సస్పెన్షన్‌ను విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ప్రభుత్వ నియంతృత్వం తారాస్థాయికి చేరిందని, అసమ్మతిని అణచివేస్తున్నదని కాంగ్రెస్ విమర్శించింది. రాజ్యసభలో విపక్ష ఎంపీల ఆందోళనల నడుమే ప్రభుత్వం రెండు బిల్లులను ఆమోదించుకొన్నది. జమ్ముకశ్మీర్, పుదుచ్చేరి అసెంబ్లీల్లో కూడా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వర్తింపజేస్తూ తీసుకొచ్చిన రెండు బిల్లులను సభ మూజవాణి ఓటుతో ఆమోదించింది.

సోమవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష పార్టీల సభ్యులు

కేంద్రం గుప్పిట్లో 'టెలికం'!

- లోక్‌సభలో బిల్లు

కీలకమైన టెలికమ్యూనికేషన్ బిల్లు-2023ను కేంద్రం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. టెలికం సర్వీసులపై కేంద్రానికి కీలక అధికారాలు కట్టబెడుతూ బిల్లులో నిబంధనలు పొందుపరిచింది. జాతీయ భద్రత పేరుతో టెలికం సర్వీసులను టేకోవర్ చేసుకునేందుకు, సస్పెండ్ చేసేందుకు కేంద్రానికి అధికారం ఉంటుంది. మరోవైపు కొత్త సిమ్ కార్డులు జారీచేసే ముందు టెలికం సంస్థలు బయోమెట్రిక్ గుర్తింపు తీసుకోవటం తప్పనిసరి చేసింది. ఇంటర్నెట్ ఆధారంగా పనిచేసే ఓటీటీ యాప్స్, వాట్సాప్, టెలిగ్రాం, డిజిటల్ పేమెంట్, వీడియో స్ట్రీమింగ్ యాప్స్, గూగుల్ మీట్.. మొదలైవాటికి బిల్లు నుంచి మినహాయింపు ఇచ్చింది. వీటికి కేంద్ర ఐటీ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నది. జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకొని నిర్దేశిత దేశాలకు చెందిన టెలికం పరికరాలు, యంత్రాలు వాడకుండా కేంద్రం అడ్డుకోవచ్చు. ప్రతిపాదిత టెలికం బిల్లుపై రాజ్యసభ ఆమోదం అవసరం లేకుండా కేంద్రం 'మనీ బిల్లు'గా తీసుకురావటంపై బీఎస్పీ ఎంపీ రితేష్ పాండే అభ్యంతరం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ భద్రత ఉల్లంఘనపై పిల్

న్యూఢిల్లీ: పార్లమెంటు భద్రతా ఉల్లంఘనపై సుప్రీంకోర్టులో ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ నెల 13న లోక్‌సభలో కొందరు వ్యక్తులు సృష్టించిన అలజడిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది. న్యాయవాది అబు సొహెల్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. ఈ నెల 13న సాగర్ శర్మ, డీ మనోరంజన్ లోక్‌సభ సందర్శకుల గ్యాలరీ నుంచి ఎంపీల మధ్యకు దూసుకెళ్లి, పసుపు రంగు పొగ బాంబులను విసిరి, కలకలం సృష్టించారు. వారిని కొందరు ఎంపీలు అడ్డుకుని, పోలీసులకు అప్పగించారు. అదే సమయంలో అమోల్ షిండే, నీలం దేవి లోక్‌సభ వెలుపల ఇటువంటి బాంబులను విసిరి, పసుపు రంగు పొగ వ్యాపించేలా చేసి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు లలిత్ ఝా, మహేశ్ కుమావత్ కూడా అరెస్టయ్యారు.

అత్యాచారం భర్త చేసినా అత్యాచారమే

- గుజరాత్ హైకోర్టు ఉద్ఘాటన

అహ్మదాబాద్, డిసెంబర్ 18: అత్యాచారానికి ఎవరు పాల్పడినా అది అత్యాచారమే అవుతుందని, భర్త తన భార్యపై ఈ దుశ్చర్యకు పాల్పడినప్పటికీ అది అత్యాచారమేనని గుజరాత్ హైకోర్టు స్పష్టం చేసింది. భారత్‌లో మహిళలపై లైంగిక హింసను కప్పిపెడుతున్న నిశ్శబ్దాన్ని ఛేదించాల్సిన అవసరం ఉన్నదని ఉద్ఘాటించింది. మహిళల వెంటపడటం, వేధించడం, దుర్భాషలాడటం, భౌతిక దాడికి పాల్పడటం, ఈవ్ టీజింగ్ లాంటి దుశ్చర్యలను శృంగారభరితమైనవిగా చూపుతూ సినిమాల ద్వారా ప్రచారం చేయడం తీవ్ర విచారకరమని పేర్కొన్నది. డబ్బు కోసం అశ్లీల వెబ్‌సైట్లలో వీడియోలను పోస్టు చేసేందుకు కోడలి పట్ల క్రూరంగా వ్యవహరించడం, బెదిరింపులకు గురిచేయడంతోపాటు భర్త, కుమారుడితో ఆమెపై అత్యాచారం జరిపించి నగ్నంగా చిత్రీకరించినందుకు అరెస్టయిన ఓ మహిళకు రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ జస్టిస్ దివ్యేశ్ జోషి ఈ వ్యాఖ్యలు చేశారు.

దావూద్‌పై విష ప్రయోగం?

- మరణించినట్టు వార్తలు..
- ఖండించిన చోటా షకీల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: మాఫియా డాన్, ముంబై పేలుళ్ల నిందితుడు దావూద్ ఇబ్రహీంపై విష ప్రయోగం జరిగినట్టు వార్తలు వెలువడ్డాయి. పాకిస్థాన్‌లోని కరాచీలో నివాసముంటున్న దావూద్‌పై అతని సహచరులలో ఒకడు రెండు రోజుల క్రితం విషప్రయోగం చేశాడని, వెంటనే అతడిని దవాఖానకు తరలించారని ఓ వార్త షికారు చేసింది. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నదని, దవాఖాన వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని కొన్ని కథనాలు వెలువడ్డాయి. కరాచీలోని ఓ దవాఖానలో ఫ్లోర్ మొత్తం ఖాళీ చేసి దావూద్ ఒక్కడినే ఉంచి చికిత్స అందిస్తున్నారని, కేవలం వైద్యులు, కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతిస్తున్నారని ఆ కథనాలు పేర్కొన్నాయి. నిజానికి దావూద్ మరణించాడని, ఆ విషయం బయటకు పొక్కకుండా నిగూఢంగా ఉంచారని మరో కథనం వెలువడింది. మరోవైపు పాకిస్థాన్‌లో ఆదివారం రాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలగటంతో దావూద్‌పై వెలువడిన కథనాలకు మరింత బలం చేకూరింది. కరాచీతోపాటు లాహోర్, రావల్పిండి తదితర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినట్టు పాక్ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. పాకిస్థాన్ తాత్కాలిక ప్రధాని అన్వర్ ఉల్ హక్ కాకర్‌కు ట్విట్టర్ అకౌంట్‌లో కూడా దావూద్ మృతికి సంబంధించిన ఒక కథనం కనిపించింది.

దావూద్ క్షేమం.. సురక్షితం: చోటా షకీల్

తమ బాస్ సజీవంగా, సురక్షితంగా ఉన్నారని దావూద్‌కు అత్యంత అనుగు అనచరుడైన చోటా షకీల్ ప్రకటించాడు. ఆయన సీఎన్ఎన్-న్యూస్18 వార్తా సంస్థతో మాట్లాడుతూ.. తాను కూడా దావూద్ మరణ వార్తలు విని షాక్‌కు గురయ్యానని చెప్పాడు. తాను శనివారం రోజునే దావూద్‌ను పలుమార్లు కలుసుకున్నానని వెల్లడించాడు. దావూద్‌పై విష ప్రయోగమూ జరగలేదు, ఆయన దవాఖానలో కూడా చేరలేదని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి.

పాకిస్థాన్‌కు చెందిన ఒక యూట్యూబర్ ఎటువంటి ఆధారాలు లేకుండా దావూద్‌పై విష ప్రయోగం జరిగినట్టు వదంతులు సృష్టించాడని వెల్లడించాయి. ముంబైలో 1993లో జరిగిన భీకర పేలుళ్ల తరువాత దావూద్ పాకిస్థాన్‌కు పారిపోయాడు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ మాఫియా డాన్ పాక్‌లోనే ఉన్నప్పటికీ ఆ దేశం మాత్రం ఇంతవరకు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. దావూద్ పాక్‌లోనే ఉన్నాడని అతని సోదరి హసీనా పార్కర్ కుమారుడు అలీషా పార్కర్ ఇటీవల వెల్లడించాడు.

కేజ్రీవాల్‌కు మరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ సోమవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న ఢిల్లీ మద్యం పాలసీ కేసులో విచారణకు హాజరు కావాలని కోరింది. గత నెల 2న విచారణకు రమ్మని ఈడీ ఇచ్చిన నోటీసుకు కేజ్రీవాల్ స్పందిస్తూ అవి ఉద్దేశపూర్వకంగా ఇచ్చినవని పేర్కొన్నారు. విచారణకు గైర్హాజరయ్యారు. మంగళవారం నుంచి పది రోజుల పాటు బయటకు వెల్లడించని ప్రాంతంలో కేజ్రీవాల్ విపాసన ధ్యానం కోర్సుకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

'డ్రైవర్ రహిత కార్లను అనుమతించేది లేదు'

న్యూఢిల్లీ: డ్రైవర్ రహిత కార్లను మన దేశంలో అనుమతించే ప్రసక్తే లేదని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి స్పష్టం చేశారు. నాగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ వార్తా పత్రికతో ఆయన మాట్లాడుతూ, 'నేను భారత దేశంలోకి డ్రైవర్ రహిత కార్లను అనుమతించను. ఎందుకంటే, అవి చాలా మంది డ్రైవర్ల ఉద్యోగాలను పోగొడతాయి. నేను అలా జరగనివ్వను' అని తెలిపారు.

లెఫ్ట్‌తో జట్టుకు సిద్ధం

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ప్రకటన
- ఎన్నికల తర్వాతే 'ఇండియా' ప్రధాని అభ్యర్థిపై నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం సంచలన ప్రకటన చేశారు. బెంగాల్‌లో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బెంగాల్‌లో 34 ఏండ్ల వామపక్ష పాలనకు ముగింపు పలుకుతూ 2011లో మమత నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లెఫ్ట్‌తో జట్టుకు మమత గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటున్న నేపథ్యంలో మమత ఈ ప్రకటన చేశారు. మరోవైపు, ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిని 2024 సాధారణ ఎన్నికల తర్వాత నిర్ణయిస్తామని.. సీట్ల సర్దుబాటుతో పాటు కూటమిలోని మిగతా సమస్యలన్నీ పరిష్కరించుకొని బీజేపీని ఓడిస్తామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. హిందీ బెల్ట్‌లో బీజేపీ బలంగా లేదని.. తాము బలహీనంగా ఉన్నామని.. ఈ సమస్యను అధిగమించేందుకు తామంతా కలిసి పని చేయాలని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ జమీందారీ సంస్కృతిని విడనాడి మమతా బెనర్జీ లాంటి సీనియర్ నాయకులకు కూటమి పగ్గాలు అప్పగించాలని టీఎంసీ కోరింది.

కేరళ గవర్నర్‌ను తొలగించాలి!

కేంద్రాన్ని కోరుతామన్న సీఎం విజయన్

కొల్లాం, డిసెంబర్ 18: గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌ను తొలగించాలని కేంద్రాన్ని కోరే విషయంపై తమ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని కేరళ సీఎం పినరాయి విజయన్ వెల్లడించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న 'నవ కేరళ సదస్' కార్యక్రమంలో భాగంగా సోమవారం కొల్లాంలో పాల్గొన్న సీఎం విజయన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్ ఆరిఫ్ ఖాన్ వ్యవహార శైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా రాష్ట్రంలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేందుకు గవర్నర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలంటే గవర్నర్ చర్యలను సరిదిద్దాల్సిన అవసరం ఉన్నదని విజయన్ అభిప్రాయపడ్డారు. కేరళలో శాంతి, సామరస్య పరిస్థితులను ధ్వంసం చేసేందుకు ఖాన్ ప్రయత్నిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆయన్ను పదవి నుంచి తొలగించాలని కేంద్రాన్ని కోరనున్నామని పేర్కొన్నారు.

2002లో అల్లరి మూకలకు

మోదీ గుణపాఠం

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

అహ్మదాబాద్: మోదీ 2002లో గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసినపుడు అల్లరి మూకలకు గట్టి గుణపాఠం చెప్పారని, అప్పటి నుంచి రాష్ట్రంలో అల్లర్లకు ఎవరూ సాహసించలేదని అమిత్ షా చెప్పారు. అహ్మదాబాద్ జిల్లాలోని సనంద్‌లో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో అమిత్ షా మాట్లాడుతూ, అయోధ్యలో శ్రీరాముడిని 550 సంవత్సరాల నుంచి ఓ గుడారంలో ఉంచారని, రామాలయాన్ని నిర్మించాలన్న ఆకాంక్షలను మోదీ నిజం చేశారని చెప్పారు.

రామమందిర ప్రారంభ ఉత్సవానికి రావొద్దు

అద్వానీ, జోషీలకు ట్రస్ట్ సూచన

న్యూఢిల్లీ: రామజన్మభూమి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వచ్చే ఏడాది జనవరిలో జరిగే రామమందిర ప్రారంభోత్సవానికి హాజరుకావడం లేదు. ఇరువుల నేతల వయసు, ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని వారిని ప్రారంభోత్సవానికి రావొద్దని కోరామని, అందుకు వారు అంగీకరించినట్టు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. మందిర ప్రారంభోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు. కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతున్నారు.

- ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ప్రారంభం

ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ప్రారంభించారు. యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌తో కలిసి స్వర్వేద మహామందిర్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ కేంద్రంలో ఒకేసారి 20 వేల మంది ధ్యానం చేసుకొనే సౌకర్యం ఉన్నది. వారణాసి నగరానికి 12 కిలోమీటర్ల దూరంలో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ధ్యానకేంద్రాన్ని నిర్మించారు.

మూడోసారీ నేనే ప్రధాని!

- వారణాసి ర్యాలీలో ప్రధాని మోదీ

వారణాసి, డిసెంబర్ 18: వరుసగా మూడోసారి అధికారం చేపట్టి, భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతానని, దేశ ప్రజలకు ఇదే నా గ్యారంటీ అంటూ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం వారణాసిలో జరిగిన ర్యాలీలో తన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ పై వ్యాఖ్యలు చేశారు. బీజేపీ గెలిస్తే.. మూడోసారి తానే ప్రధాని అవుతానని నర్మగర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. అయితే ప్రధాని వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. 2025 సెప్టెంబర్‌లో ప్రధాని మోదీకి 75 ఏండ్లు రాబోతున్నాయి. 75 ఏండ్లు దాటాయన్న నెపంతో పార్టీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ, వెంకయ్యనాయుడు తదితరులను ఎన్నికల రాజకీయాల నుంచి దూరం పెట్టిన మోదీ-అమిత్ షా ద్వయం, తమ విషయంలో అది పాటించకపోవటాన్ని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. తమకు గిట్టని వారిని పార్టీ నుంచి వెళ్లగొట్టేందుకు ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం ఎంచుకున్న 'రెండు నాల్కల ధోరణి'గా విమర్శించారు.

దేశంలో పేలుళ్లకు ఐసిస్ కుట్ర.. 8 మంది అరెస్ట్

న్యూఢిల్లీ: దేశంలో భారీ పేలుళ్లకు ఐసిస్ ఉగ్రసంస్థ పన్నిన కుట్రను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) భగ్నం చేసింది. ఎనిమిది మంది ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేసింది. బళ్లారి, బెంగళూరు, అమరావతి, ముంబై, పుణే, జంషెడ్‌పూర్, బొకారో, ఢిల్లీలలో సోమవారం ఎన్ఐఏ తనిఖీలు చేపట్టింది. అరెస్ట్ అయిన 8 మంది ఐఈడీ పేలుళ్లు జరిపేందుకు కుట్ర పన్నినట్టు అధికారులు తెలిపారు.

సీటీస్కాన్‌తో యువతలో బ్లడ్ క్యాన్సర్ ముప్పు

న్యూఢిల్లీ: అంతుపట్టని ఏ చిన్న అనారోగ్యానికి గురైనా వైద్యులు సీటీ స్కాన్ చేయించడం పరిపాటిగా మారింది. అయితే, ఈ విషయం తెలిస్తే మాత్రం సీటీస్కాన్ అంటేనే ఆమడ దూరం పారిపోతారు. సీటీస్కాన్ వల్ల చిన్నారులు, యువతలో బ్లడ్ క్యాన్సర్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉందని నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం స్పష్టం చేసింది. స్పష్టమైన ఇమేజీల కోసం సీటీస్కాన్‌లో వాడే ఎక్స్ కిరణాల ద్వారా వెలువడే రేడియేషన్ యువతను తీవ్రమైన ముప్పులోకి నెట్టేస్తున్నదని అధ్యయనం వెల్లడించింది. సీటీస్కాన్ ద్వారా విడుదలయ్యే రేడియేషన్ లింఫోయిడ్, మైలోయిడ్ బ్లడ్ క్యాన్సర్లకు కారణమవుతున్నట్టు బార్సిలోనాలోని పాంప్యూ ఫాబ్రా వర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు.

జంబలకిడి పంబ

- పురుషుడి నుంచి అండాలు
- మహిళల నుంచి శుక్రకణాలు
- చర్మ మూలకణాల సాయంతో మారనున్న పునరుత్పత్తి ప్రక్రియ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): 'జంబలకిడి పంబ' సినిమా గుర్తుందా? పురుషులు మహిళలుగా, మహిళలు పురుషులుగా మారి నవ్విస్తారు. శాస్త్రవేత్తలు తాజాగా తీసుకురాబోతున్న అత్యాధునిక ఐవీజీ (ఇన్-వెట్రో డిరైవ్‌డ్ హ్యూమన్ గేమేట్స్) సాంకేతికతతో దాదాపుగా అవే పరిస్థితులు రాబోతున్నాయి. అయితే, ఈ విధానంలో మహిళలు పురుషులుగా, పురుషులు మహిళలుగా మారనప్పటికీ.. పురుషుల ద్వారానే ఇప్పటివరకూ సాధ్యమవుతున్న శుక్రకణాలను మహిళల సాయంతో, స్త్రీల నుంచి సేకరిస్తున్న అండాలను పురుషుల సాయంతో సృష్టించవచ్చు.

ఎలా సేకరిస్తారు?

పురుషుడి చర్మంలోని మూల కణాలతో అండాన్ని, స్త్రీ చర్మంలోని మూల కణాలతో శుక్రకణాలను ఐవీజీ టెక్నిక్ సాయంతో పరిశోధకులు తయారు చేయాలనుకొంటున్నారు. 2012లో మగ, ఆడ ఎలుక తోక చర్మం నుంచి సేకరించిన మూల కణాలతో పరిశోధకులు వరుసగా అండం, శుక్రకణాలను సృష్టించడమే కాకుండా ప్రయోగశాలలో కృత్రిమగర్భధారణ పద్ధతిలో టెస్ట్ ట్యూబ్ ఎలుకకు జీవంపోశారు. ఇప్పుడు అదే విధానంలో మనుషుల్లోనూ ప్రయోగాలు చేయాలనుకొంటున్నారు.

లాభమేంటి?

క్యాన్సర్‌బారిన పడిన మహిళల్లో అండాల విడుదల సక్రమంగా ఉండదు. వయసు రీత్యా గర్భధారణ జరిగే అవకాశమూ మరి కొందరికి దూరమవ్వచ్చు. మారిన జీవనశైలి కారణాలతో పురుషుల్లోనూ సంతాన సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి దంపతులకు తమ జీవ కణాల ద్వారానే సృష్టించే సంతానాన్ని అందించాలన్న ఉద్దేశంతోనే ఈ పద్ధతిని తీసుకొస్తున్నట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే, ఈ విధానం భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులకు కారణం కావొచ్చని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

కోర్టుకు జ్ఞానవాపీ సర్వే నివేదిక

- వారణాసి కోర్టులో సమర్పించిన ఏఎస్ఐ
- 21న విచారణ చేపట్టనున్న కోర్టు



వారణాసి, డిసెంబర్ 18: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపీ మసీదులో శాస్త్రీయ సర్వే పూర్తి చేసిన ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) స్థానిక జిల్లా కోర్టుకు సోమవారం సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించింది. ఈ కేసులో తదుపరి విచారణను కోర్టు ఈ నెల 21కు షెడ్యూల్ చేసింది. ఈ నేపథ్యంలో ఏఎస్ఐ నివేదికలో ఏముందనేది ఆసక్తికరంగా మారింది. ఈ నెల 21న న్యాయస్థానం నివేదికను తెరుస్తుందని, రెండు పక్షాల న్యాయవాదులకు దాని కాపీలు అందజేస్తుందని హిందూ పిటిషనర్ల తరపు న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ తెలిపారు. అయితే నివేదికను బహిరంగపర్చొద్దని ముస్లిం తరపు నుంచి పిటిషన్ వేశారని, అయితే నివేదికను బహిర్గతం చేయాలని తాము కౌంటర్ వాదనలు వినిపించామని పేర్కొన్నారు. వారణాసిలో కాశీ విశ్వనాథుడి ఆలయం పక్కనే ఈ జ్ఞానవాపీ మసీదు కాంప్లెక్స్ ఉంటుంది. అయితే అంతకు ముందు ఉన్న ఆలయంపై 17వ శతాబ్దంలో ఈ జ్ఞానవాపీ మసీదును నిర్మించారని ఆరోపిస్తూ వారణాసి కోర్టులో పలువురు పిటిషన్లు వేశారు. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని తేల్చేందుకు మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించాలని వారణాసి జిల్లా కోర్టు ఈ ఏడాది జూలై 21న ఆదేశించింది.

శ్రీకృష్ణ జన్మభూమి కేసు తీర్పు వచ్చే నెల 11న

అలహాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఉన్న శ్రీకృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా మసీదు కేసులో అలహాబాద్ హైకోర్టు తీర్పు వచ్చే నెల 11న వెలువడబోతున్నది. దీంతో అనేక దశాబ్దాల నుంచి కొనసాగుతున్న వివాదానికి తెరపడే అవకాశం కనిపిస్తున్నది. శ్రీకృష్ణుని జన్మ స్థలంలో 13.37 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన దేవాలయాన్ని మొఘలు చక్రవర్తి ఔరంగజేబు ధ్వంసం చేసి, మసీదును నిర్మించాడని హిందూ పక్షం వాదిస్తున్నది. హైకోర్టు గురువారం ఇచ్చిన ఆదేశాల్లో, ఈద్గా మసీదు సముదాయంలో ప్రాథమిక సర్వే నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. కోర్టు పర్యవేక్షణలో ముగ్గురు సభ్యుల బృందం సర్వే చేయాలని ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తూ ముస్లిం పక్షం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కానీ సర్వేను నిలిపేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

కాంగ్రెస్ @ 138 ఏండ్లు

- రూ.138 లేదా 1,380 లేదా 13,800 విరాళాలివ్వాలని విజ్ఞప్తి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం నిధుల సేకరణను సోమవారం ప్రారంభించింది. 'దేశం కోసం విరాళం ఇవ్వండి' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ప్రజలను విరాళాలు అడగడం ఇదే తొలిసారి అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ స్థాపించి 138 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో, రూ.138 లేదా రూ.1,380 లేదా రూ.13,800 విరాళంగా ఇవ్వాలని ఆ పార్టీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాలు ఈ నెల 28న జరుగుతాయి. అప్పటి వరకు విరాళాల సేకరణను ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, కనీసం రూ.138 విరాళం ఇవ్వాలని ప్రజలను కోరుతారు.